# ముసుగు

ఉర్దూ మూలం : అనిల్ ఠక్కర్

అనువాదం : శ్రీధర శ్రీరామకృష్ణ

**నేను :**

'లేదు. అలా కుదరదు'

'ఎంచేత'

'అనవసరంగా నన్ను విసిగించకండి'

'అలాకాదు'

'ఏమైనాసరే కుదరదు'

'నే రూమ్ బుక్‌చేసొచ్చాను'

'కాన్సిల్ చేసేయండి'

'ఎందుకని'

"అయ్యా, మహానుభావా! దయచేసి నాతోటి వాదించకండి' అంది శ్రీమతి. అలా అంటంతోటే ఆమె కంఠం రుద్ధమైంది. కళ్ళు కల్హార సరస్సులయ్యాయి. చీరకొంగుతో కన్నీళ్ళు తుడుచుకుంటూ వంటింట్లో కెళ్ళిపోయింది. నేను నా కోపాన్ని నాలోనే దిగమింగుకుని అసహాయకంగా ఆమె వెళ్ళిన వైపే చూస్తుండిపోయాను.

నాభార్య చాలా కోపిష్ఠి. ఆమెకి కోపం వస్తే నేను చాలా ఇబ్బందిగా ఫీలవుతాను. ఆమె మనసుకి నచ్చినట్టు నడుచుకుంటే చాలు ఆమె కోపం దానంతటదే తగ్గిపోతుంది. కానీ ఏదో ముఖ్యమైనది పోగొట్టుకున్న భావన కలిగిన నా నరాల్లో మళ్ళీ ప్రేమ ప్రవాహం మొదలవటానికి కొన్ని రోజులపాటు పడుతుంది. అప్పటి వరకూ నాలో నేను మధనపడక తప్పదు. అది నాకు మామూలే.

అలా అని తనేమీ చెడ్డది కాదు. పాత కాలపు భార్యామణుల్లాగే దేవుడి తర్వాత రెండో స్థానం నాకిచ్చి ప్రేమాభిమానాలతో చూసుకుంటూనే ఉంటుంది. కానీ కోపం వస్తే మాత్రం, ముళ్ళపీటమీద కూర్చున్న భావన నాలో కలిగేట్టుచేసి నా నరనరాలనీ పిండినట్టు ప్రవర్తించి మనశ్శాంతి లేకుండా చేసేస్తుంది. మళ్ళీ ఇద్దరం ప్రేమానురాగాలతోనే ఉంటాం. ఈ ఇరవై సంవత్సరాల సంసారిక జీవనంలో మా ప్రేమ అణువంతకూడా తగ్గలేదు. అనురాగపుటలలు మా సంసారసాగరంలో సుగమ సంగీతాన్నే వినిపిస్తున్నాయి. అందుకు నిదర్శనంగా ముత్యాల్లాంటి ఇద్దరు పిల్లలు కలిగారు మాకు అమ్మాయి షబ్నమ్ అబ్బాయి జావీద్.

నా ఆత్మాభిమానం దెబ్బ తిన్నప్పుడల్లా తనని సైక్రియాట్రిస్ట్ దగ్గరకు తీసుకెళ్ళి చికిత్స చేయించాలనిపించేది. కానీ తను దానికి ఒప్పుకునేది కాదు. పరపురుషులముందుకు బురకా లేకుండా వెళ్ళటం ఆమెకు అస్సలు ఇష్టం ఉండదు. నా ఆప్తమిత్రులు కూడా సరిగ్గా ఆమె ముఖం చూడ్లేదు. ఏదైనా పార్టీ లేక ఫంక్షన్‌కి వెళ్దామని పిలిస్తే " నేను, నాకు సంబంధించిన సర్వస్వం మీకోసం మాత్రమే. ప్రదర్శన కోసం కాదు. నేను మీతో ఎక్కడికీ రాను' అని నిరాకరించేది. నేను పొరబాటున బలవంతం చేసానో అంతే ఆ రోజు ఆవిడ కోపాగ్నిలో మాడి మసైపోవల్సిందే. అలా అని ఆమె చదువుకోనిదీ, పల్లెటూరులో పెరిగిందీ కాదు. కాలేజీలో రెండు సంవత్సరాలబాటు చదివింది. పోనీ బురకాతోటీ, పరదాల మధ్యన పుట్టిన మనిషీ కాదు. కాలేజీలో చదివేప్పుడుగానీ మా మారేజి రిసెప్షన్‌లోగానీ బురకావేసుకోలేదు. పెళ్ళయిన ఆర్నెల్లదాకా అసలు తన దగ్గర బురకాలేనేలేదు.

అప్పటికి మా పెళ్ళయినాలుగైదు మాసాలయిందనుకుంటాను. మా హృదయాలు స్పర్శ, స్పందనల తాలూకు అనుభూతులని పూర్తిగా చవిచూడలేదప్పటికి. ఒకరోజు వాళ్ళనాన్న వచ్చి తనని ఊరుకుతీసుకెళ్ళారు. ఒక నెలపాటు తను పుట్టింట్లోనే ఉంది. ఆ నెలరోజుల్లో ఆమె రాసిన ఉత్తరాలు భావుకురాలైన ఏ కవయిత్రి రాసిన ఉత్తరాలకీ తీసిపోనట్టుగా ఉండేవి. ఆ నెలరోజులూ తను రాసిన ఆ ఉత్తరాలే నాకు ప్రాణవాయువు నందించాయనటంలో ఏమాత్రం అతిశయోక్తిలేదు.

ఒకరోజు, ముందుగా తెలియపర్చకుండానే తనని పిల్చుకురావటానికి బీజాపూర్‌కి మా మామగారింటికి వెళ్ళాను. చెప్పపెట్టకుండా వెళ్ళటంతో తనూ, తనతోబాటు మా మామగారూ, అత్తగారూ తెగ కంగారు పడిపోయారు. వాళ్ళు అద్దెకున్నది ఒకే ఒక్క పెద్దగది ఉండి మధ్యలో కిచెన్‌కు చిన్న పార్టీషన్ ఉన్న పోర్షన్. ఇంట్లో కుటుంబ సభ్యుల సంఖ్య పెంచటంలో మా మామగారేం పిసినారితనం చూపించుకోలేదు. అంచేత ముగ్గురు వదినగార్లు, ముగ్గురు తోడల్లుళ్ళు నా చుట్టూ చేరి కుశలప్రశ్నలు వేయటం మొదలెట్టారు. మామగారు మాంసం తేవటానికని సంచీ తీసుకుని మార్కెట్‌కు బయిలుదేరారు. అత్తగారు మా ఆవిడని పక్కనపెట్టుకుని వంట మొదలెట్టారు. మా ఆవిడ మాత్రం వంటగదిలోంచి ఏదో నెపంతో మేం కూర్చున్న చోటుకి వచ్చి నాకు చిరునవ్వులతో ముద్దులు కురిపించి వెళ్ళేది.

అత్తగారింట్లో ఆదరాతిధ్యాలు అందుకుంటూ మధ్యాహ్నం పూట గడుపుతున్న సమయంలో కనీసం అక్కడ ఓ వారం రోజులైనా ఉండాలని నిర్ణయించుకున్నాను. కానీ నా ముందు ఒక పెద్ద సమస్య వచ్చి కూర్చుంది. రాత్రి పడకల విషయం ఎలా? ఉన్నది ఒకటిన్నర రూమ్. ఇంత మంది జనం. మనుష్యుల కంటే ఎక్కువ ప్రమాణంలో ఉండి భయపెడుతున్న బీజాపూరు రాజమశకాలు. వీటన్నిటి మధ్య నేనక్కడ్నుంచి నాతో బాటు భద్రంగా తెచ్చుకున్న స్పర్శాపేక్ష ఎలా తీరుతుంది? ఏమైతే అయిందని, రాత్రి సంగతి రాత్రికే వదిలేసి, భార్యాసమేతంగా ఇతిహాసిక స్థలాలని సందర్శించే మిషతో గోల్‌గుమ్మట్ గార్డెన్‌కి చేరుకున్నాను. తను పూదోటలో కిలకిలా నవ్వుతూ ఓ సీతాకోక చిలుకలా అటూ ఇటూ తిరుగాడసాగింది. తన స్వర సంగీతంతో నాలో ఒక రకమైన మత్తును కలుగజేసింది

గోల్‌గుమ్మట్ దగ్గర్లో ఉన్న దర్గా పాలరాతి గుమ్మటం వెనుక సూర్యుడు ఎరుపురంగులోకి మారుతున్నాడు. తను, గార్డెన్‌లో కూర్చున్నప్పుడు చీరకంటుకున్న ఎండుటాకుల్నీ, చిన్నపుల్ల ముక్కల్నీ దులుపుకుంటూ లేచింది. మేం మెల్లగా అడుగులు వేసుకుంటూ ఇంటికి ప్రయాణమయ్యాం.

దారిలో మాట్లాడుకుంటూ వెళ్తున్నప్పుడు తన భుజం నా శరీరానికి అనుకోకుండా తగుల్తుందో లేక మగపులిని రెచ్చగొట్టడానికి ఆడపులి తన శరీరాన్ని మగపులి శరీరానికి రాస్తూ రాపిడి కలిగించినట్టు కావాలనే తన భుజాన్ని నా


JAIRAM

శరీరానికి తగిలిస్తోందో! మొత్తానికి ఇద్దరి తనువుల్లోనూ కోరికల సెగలు సమానంగా లేచినట్టు అనిపించింది నాకు.

దారిలో నాదృష్టి అకస్మాత్తుగా పెద్ద బోర్డు మీద పడింది. నా మనసులో విద్యుత్ చలనం కలిగిన అనుభూతి కలిగింది. నా శరీరతృష్ణకు సరైన పరిష్కారం దొరికినట్లైంది. నేను వెంటనే తనని వాళ్ళమ్మని ఎలాగైనా ఒప్పించమని, అలా చేస్తే మా శారీరక తాపాన్ని తీర్చుకునేందుకు అవకాశం దొరుకుతుందని పోరటం మొదలుపెట్టాను. నా మాట విని తను మొదట చాలా భయపడింది కానీ నేను బాగా వత్తిడి చేయటంతో నేను కోప్పడుతాననే భయంతోనో లేక తన దేహానికీ నా స్పర్శ కావాలనిపించిందో వాళ్ళమ్మని ఒప్పించటానికే ఒప్పుకుంది. వాళ్ళమ్మ ఎటువంటిదైనా దానికి ఒప్పుకోకుండా ఉండదని నాకు బాగా తెల్సు. ఎందుకంటే మొగుళ్ళని, మిగిలిన అల్లుళ్ళని చూసి భయపడకపోయినా, కొత్త అల్లుళ్ళని చూసి మాత్రం అత్తలు కాస్త భయపడతారని నా నమ్మకం. ఆవిడ ఒప్పుకుంటే సరి మామగారు క్లీన్‌బౌల్డ్ అయినట్టే.

అలా మేం హోటల్‌రూమ్‌లో అత్యుత్సాహంగా, రవంత జాగ్రత్తగా మరింత మత్తుగా గడిపేశాం. తెల్లవారుతూ పక్షులు కిలకిలరవాలతో రెక్కలు విదుల్చుకుంటుంటే అప్పటికీ తను ఇంటికి వెళ్ళటానికి సిద్ధమై కూర్చుంది. వీలయినంత తొందరగా ఇంటికి వెళ్ళి, నెమ్మదిగా నేను రెడి అయి ఇంటికి వెళ్ళేటప్పటికి టిఫిన్ తయారు చేసి ఉంచాలని తన ఆలోచన. రాత్రి మేం వచ్చిన టాంగా అతనికి పొద్దుటే కూడా రమ్మని చెప్పి ఉంచాను. బయటకి వచ్చి చూస్తే టాంగా రడీగా ఉంది. తనని అందులో ఇంటికి పంపించేశాను.

తను వెళ్ళిన సుమారు రెండుగంటల తర్వాత నేను నడుచుకుంటూనే వాళ్ళింటికి వెళ్ళాను. లోపలికి అడుగుపెట్టడంతోటే నేను వచ్చింది మామగారింటికేనా లేక ఏదైనా శిధిలమైన ప్రాచీన ఇతిహాసిక స్థలానికా అన్న అనుమానం కలిగింది. ఇంట్లో స్మశాన నిశ్శబ్దం ఆవరించి ఉంది. మా వదినగార్లు, తోడల్లుళ్ళు డేగని చూసి భయపడ్డ పక్షుల్లా ఓ మూల భయంగా ఒదిగి కూర్చున్నారు. మా మామగారు ఓ మూల వెర్రిమొహమేసుక్కూర్చుని బీడీ తాగుతున్నారు. ఆయన నన్ను చూసిన తీరు గమనిస్తే నాకు ఏదో చావు కబురు చెప్పటానికి కాసుక్కూర్చున్నట్టనిపించింది. వంటింటి గుమ్మంలో అత్తగారు తలమీద చేతులుంచుక్కూర్చుని నిట్టూర్పులు విడుస్తున్నారు. ఇక కనపడని దల్లా శ్రీమతే. లోపలికి చూస్తే కనపడ్లేదు. భయంతో నాగుండె వేగంగా కొట్టుకోసాగింది. జరిగిన విషయం ఏమిటని ఎవర్నన్నా అడగటానికి ధైర్యం చాలలేదు. ఇంతలో దొడ్డి గుమ్మంలోంచి ముందు రూమ్‌లోకి వచ్చింది తను. నన్ను చూట్టంతోనే "మనం ఇవ్వాళ వెళ్ళిపోవాలి" అంది.

"ఎక్కడికి" ఆశ్చర్యంగా అన్నాను నేను

"మనింటికి"

"ఎందుకు"

"ఊరకనే"

"అంటే...."

నా ముఖంమీద కనబడ్డ ఆశ్చర్యాన్ని గమనించకుండానే తను బట్టల్ని సూట్‌కేస్‌లో కుక్కటం మొదలెట్టింది. నేను మామగారి వైపు చూసాను. ఆయన కాల్చిన బీడీని కుర్చీ క్కరకేసి నలుపుతూ "చాలా చెప్పిచూసాను. కానీ వింటంలేదు" అన్నారు.

వెంటనే మా అత్తగారు అందుకుంటూ "హోటల్‌నుంచి వచ్చింది మొదలు ఒకటే మొండి పట్టు పట్టింది" అన్నారు.

"హోటల్‌నుంచి వచ్చింతర్వాతా!" ఆశ్చర్యంగా అడిగాను నేను.

"అవును. మీ ఇద్దరి మధ్యా ఏదైనా గొడవ జరిగుండొచ్చు అనుకున్నాం మేం'

"లేదు. అసలలాంటిదేం జరుగలేదు' అని అత్తగారితో అంటుండగా లోపల్నుంచి తను "నేను చెప్పాను కదా. అలాంటిదేం జరగలేదని' అని అరిచింది.

మళ్ళీ తనే అంది 'మీరు రడీ అవండి నేను రడీ'

'ఇవాళేనా'

'ఊ! ఇప్పుడే'

'కానీ....'

'కానీలేదు గీనీలేదు. వెళ్ళాల్సిందే'

'ఇంట్లో నిన్నెవరైనా ఏమన్నా అన్నారా?'

'లేదు'

'మరి!'

'మహానుభావా! మీకు పుణ్యముంటుంది. నాతో తర్కించకండి' అంటూ చిన్నపిల్లలా ఏడవటం మొదలెట్టింది తను బెదిరిన జింకలా ఆమె శరీరం కంపిస్తోంది. ఎన్నో విధాల అడిగి చూసాను. ఏమీ ఉపయోగం లేకపోయింది. తను మాత్రం పట్టిన పట్టు విడవలేదు.

ఇది తనకి కోపం రావటం మొదటి సారి. జీవితంలో ఏదో పోగొట్టుకున్న భావన అప్పుడే మొదలయ్యింది నాకు. అదేం పట్టించుకోకుండా మూటా ముల్లె సర్దుకుని తనతో బాటు బయల్దేరాను. ఇంతలో ఏదో గుర్తుకొచ్చి భయంగా వెనక్కితిరిగి "అమ్మా నీ బురకా కావాలి' అంది తను.

'బురకానా'

'ఊ. అవును'

'నా దగ్గరుండేది చాలా పాతదమ్మా!'

"ఫరవాలేదు. సర్దుకుంటాను"

అప్పుడే మొదటిసారిగా తను బురకా ధరించటం. ఇప్పటికి ఇరవై ఏళ్ళయినా బురకా ఆమె దేహాన్నుంచి ఎప్పుడూ వేరు కాలేదు. బహుశ, తను చనిపోయే వరకూ తనతోపాటే ఉంటుందేమో!

అప్పుడప్పుడు ఏదో ఒక విషయానికి తనకి కోపం రావటం జరిగినా మొత్తంమీద మా జీవనం ఆహ్లాదకరంగానే సాగుతోంది. అయితే ఇవ్వాల్టి కోపం మాత్రం మొదటి సారంత తీవ్రంగానే ఉంది. అదే రోదన, అదే రీతిలో శరీరకంపన, అదే కచ్చితమైన మాట. నా అదృష్టం బావుండబట్టి పిల్లలు ఇంట్లో లేరు. ఉంటే నా పరిస్థితి మరీ దయనీయంగా ఉండేది. అల్లుడు ఈ రోజే బొంబాయి నుంచి వచ్చాడు. షబ్నమ్, జావీద్ అతనితో కల్సి సినిమాకి వెళ్ళారు.

ఎందుకో పొద్దుట్నించీ తనకి మూడ్ బాగోలేనట్టుగానే వుంది. షబ్నమ్‌కు బురకా లేకుండా మొగుడితో కల్సి మార్కెట్‌కి వెళ్తున్నప్పుడే తనకి కోపమొచ్చి ఏదో అనబోయి మళ్ళీ ఎందుకో మాట్టాడక ఊరుకుంది. కానీ సినిమాకి బురకాలేకుండా వెళ్తుంటే మాత్రం కోపం ఆపుకోలేక అది పద్ధతి కాదని సున్నితంగానే హెచ్చరించింది. అత్తగారివన్నీ పాత పద్ధతులన్నట్టు అల్లుడో చిరునవ్వు నవ్వి, షబ్నమ్, జావీద్‌లను తీసుకుని సినిమాకెళ్ళిపోయాడు. వాళ్ళు బయటికి వెళ్ళిం తర్వాత తను ఆడపులిలా కోపంతో చిందులేయసాగింది. ఎందుకంటే వాళ్ళని చిన్నప్పట్నుంచీ మమతానురాగాలతో పెంచి, చక్కని క్రమశిక్షణతో ఇంతవాళ్ళని చేసింది. తన కోపం చూసి బయటకు పోవటమే మంచిదనుకుని మార్కెట్‌కు బయులుదేరాను నేను. ఇంటికి వచ్చేప్పుడు ఒక పెద్ద హోటల్‌లో అమ్మాయి, అల్లుడికోసం ఒక రూమ్ బుక్ చేసి వచ్చాను. ఎందుకంటే మా అద్దెకొంపలో కూడా ఒకటిన్నరరూమ్ మాత్రమే ఉంది అల్లుడు బొంబాయి వాడు. పైగా


మొదటిసారి మా ఇంటికి వచ్చాడు అతనికి ఏ లోటూ రాకూడదనే హోటల్‌లో రూమ్ బుక్ చేయటం. కానీ రూమ్ బుక్ చేసిన సంగతి చెప్పగానే తను ఇంతెత్తున లేచింది. నాకు ఏంచేయాలో పాలుపోలేదు. ఏదో కోల్పోయిన అనుభూతి కలిగిన నేను శరీరాన్నీడ్చుకుంటూ వంటింట్లోకి వచ్చేసరికి తను ఏడుస్తూ కూర్చుంది. నిలువెల్లా కోపంతో కంపించిపోతోంది. దగ్గరగా ఉన్న స్టూల్ లాక్కుని కూర్చుని సిగరెట్ తీసి అంటించాను. సిగరెట్లు తాగుతూ తాగుతూ అలా ఎంత టైమ్ గడిచిందో తెలవనే లేదు. సిగరెట్ ప్యాకెట్ ఖాళీ అయ్యేటప్పటికి గానీ నేను అలా స్టూల్‌మీద శిలా ప్రతిమలా చాలా సేపట్నుంచి కూర్చున్నానన్న విషయం స్ఫురణకు రాలేదు. ఈ మౌనాన్ని ఎలా అయినా ఛేదించాలని, ధైర్యం కూడగట్టుకుని స్టూల్‌మీంచిలేచి ఏదో మాట్లాడబోయేంతలో ఏదోనీడ నేలపై కదిలి మసాలా రుబ్బుతున్న తన దగ్గర ఆగింది. నేను తిరిగి చూసాను. నా వెనకాల షబ్నమ్. మనిషి చాలా సంతోషంగా ఉంది. నేను పక్కకు తప్పుకుని దారిచ్చాను. షబ్నమ్ వాళ్ళమ్మ దగ్గరకెళ్ళి 'అమ్మా! నువ్వులే. నేను రుబ్బుతాను మసాలా' అంది.

'వద్దులే గానీ, మొదట నువ్వు బట్టలు మార్చుకుని, కాళ్ళూ చేతులూ మొహం కడుక్కుని అన్వర్‌మియాకి టీ పెట్టియ్యి' అంది తను

నేను తన ముఖం చూస్తే నాకనిపించింది ఇంకా తన కోపం తగ్గలేదని, ఇక్కడే ఎక్కడో మా ఒకటిన్నర రూమ్ పోర్షన్‌లోనే దాక్కుని వుంది అని.

రాత్రి ఎనిమిది గంటలవుతోంది. తనూ షబ్నమ్ కల్సి సాయంత్రం నుంచి అన్వర్ మియా కోసం బిరియానీ తయారు చేయటంలో నిమగ్నమై ఉన్నారు. ముందర రూమ్‌లో అంటే మా పడక గదిలో అన్వర్‌మియా ఏదో సినిమా పత్రిక తిరగేస్తున్నాడు. పడక్కుర్చీలో ముడుచుకు పడుకుని దోమలు కుడుతుంటే అటు పక్కకి, ఇటు పక్కకి దొర్లుతున్నాను నేను. అలా దొర్లినప్పుడల్లా నా జేబులో ఉన్న హోటల్ రూమ్‌కీ శబ్దం చేస్తూనే ఉంది. ఆశబ్దం వినబడినప్పుడల్లా అల్లుడు సినిమా పత్రికలోంచి తల బయటకు పెట్టి నా జేబు వైపు దృష్టిసారిస్తున్నాడు. నేను మాత్రం ఆ చప్పుడయినప్పుడల్లా దేవుణ్ణి మనసులోనే స్మరించుకుంటున్నాను.

భోజనం అయింతర్వాత, వీధి చివర్న ఉన్న పాన్ అంగడి దగ్గరకెళ్ళి సిగరెట్ తాగుతుంటే ఎవరో కవి అన్న మాటలు గుర్తుకొచ్చాయి. "ప్రేయసి కాలిగజ్జెలు అపశకునానికి చిహ్నమట. ఎందుకంటే అవి ఘల్లుమని శబ్దం చేస్తూ ఆమె రహస్యాలన్నింటినీ బట్ట బయలు చేస్తాయట" అది గుర్తుకు రాగానే ఎందుకో బాధతో కూడిన చిరునవ్వొకటి నా పెదవులపై విరిసింది. చివరిసారిగా సిగరెట్‌ను గట్టిగా పీల్చి పీకను కిందపడేసి ఇంటి వైపుకి బయలుదేరానో లేదో ఎదురుగా జావీద్ వస్తూ కనిపించాడు. వాడి చేతిలో పుస్తకాలున్నాయి. వాడ్ని ఆపి అడిగాను.




"ఎక్కడికి బయలుదేరావు!"

"ఫ్రెండింటికి చదువుకోటానికి" జవాబిచ్చాడు వాడు.

"మీ అమ్మకి తెల్సా ఈ విషయం"

"అమ్మే వెళ్ళమంది"

"మళ్ళీ ఎప్పుడొస్తావ్"

"తెల్లారాక" అనేసి ముందుకు సాగిపోయాడు వాడు.

శ్రీమతి కోపం ఏ టైమ్‌కి ఎలా మారుతుందో తెల్సుకోవటం కష్టం. ఎన్నడూ పిల్లల్ని టైముకాని టైములో ఇంటి గుమ్మం దాటనివ్వని తను జావీద్‌ని ఫ్రెండింటికి ఎలా పంపిందో నాకర్థం కాలేదు.

నేను పెద్ద పెద్ద అడుగులు వేసుకుంటూ ఇంటికి చేరుకున్నాను. లోపలికి అడుగు పెడుతూనే ఆశ్చర్యపోయాను. అస్తవ్యస్తంగా ఉండే ముందు రూమ్ అన్ని హంగులతో కూడిన అందమైన పడగ్గదిలా మారిపోయి ఉంది. దాన్ని చూసి నేను ఆశ్చర్యంలోంచి తేరుకోకముందే మీరు ఎక్కడికెళ్ళారు అని నిష్ఠూరంగా అడిగింది.

'ఆ.... నేనా.... వీధిచివరవున్న పాన్ డబ్బీ దగ్గర కెళ్ళాను. సిగరెట్ కోసం' అంటూ తడబడుతూ సమాధానమిచ్చాను.

'ఇక నడవండి లేటవుతోంది' అంటూ బురకా ముఖం మీదకు వేసుకుని ఇంట్లోంచి బయటకు నడిచింది. నేను తనని అనుసరించాను. కొద్దిగా వేగంగా అడుగువేసి తనని సమీపించి 'మనం ఎక్కడికి వెళ్తున్నాం' అన్నాను.

'మీరు రూమ్ బుక్ చేసారు కదా!" అంటూ నడుస్తూనే సమాధానమిచ్చింది. ఆమాట వింటంతోటే నా మెదడు మొద్దుబారినట్టయిపోయింది. ఆలోచనాశక్తి నశించిపోయింది. ఇంతలో ఎదురుగా వస్తున్న ఆటోని ఆపి ఎక్కికూర్చుంది తను. నేనూ ఎక్కి కూర్చున్నాను. ఎక్కడకి అన్నట్టు చూసాడు ఆటోవాడు.

తను మోచేత్తో నన్ను పొడిచి సమాధానం చెప్పమన్నట్టు చూసింది. నేను ఆటోవాడికి హోటల్ పేరు చెప్పాను.

## తను :

నా కళ్ళనుంచి కన్నీరు ధారాపాతంగా ప్రవహిస్తోంది కానీ మనసారా ఏడవటానికి ఇది నా యిల్లు కాదు. బుల్‌బిల్ పిట్ట కూడా తను దుఃఖాన్ని తీర్చుకోవటానికి పంజరాన్నే ఎన్నుకొంటుంది.

చాలా ఏళ్ళక్రితం ఇలాగే ఓరాత్రి నేనూ, ఆయనా బీజాపూర్‌లో టాంగామీద ఒక హోటల్‌కి వెళ్ళాం. ఆ రాత్రి అవ్యక్తమైన ఆనందంలో మునిగితేలాను. కానీ ఈరోజు ఎందుకో శరీరం భయంతో కంపిస్తోంది. ఆ రాత్రి నా శరీరం, మనసు, సర్వస్వం ఆనంద డోలికల్లో తేలియాడింది. కానీ ఈరోజు నా శరీరంలోని అణువణువూ

దుఃఖంతో నిండుకొని ఉంది. ఆ రాత్రి నా సంతోషాన్ని ఆయనతో పంచుకోటానికి వెళ్ళాను. కానీ ఈరోజు తప్పని పరిస్థితుల్లో మాత్రమే వెళ్తున్నాను. ఆ రాత్రి నా సర్వస్వాన్నీ ఆయనకి ధారపోయటానికి వెళ్ళాను. కానీ మర్నాడు హోటల్ నుంచి తిరిగి ఇంటికెళ్ళేప్పుడు నేను నా సర్వస్వాన్ని ఆయునకి ధారపోసానో లేక నేనే సంపూర్ణమైన ఆనందంలో తిరిగి వెళ్తున్నానో నిర్ణయించుకోలేకపోయాను. ఒకరకమైన మత్తులాంటిది ఆవరించి ఉంది నన్ను. ఆ స్థితిలో నేను టాంగా దాకా నడిచి వెళ్ళగలనో లేదో అనిపించింది. నా శరీరంలో ప్రతి అణువు భారవంతమైనట్టు, ఆ బరువుకి జారికింద పడిపోతానేమోనన్నట్టు. మనసు నిండా ఆనందం పొంగి పొరలుతున్నట్టు భావన. హృదయం, మస్తిష్కం, పూర్తి శరీరం నా అధీనంలో లేనట్టనిఫించింది.

ఆయన నన్ను టాంగా దాకా వదలటానికి వచ్చారు. నేను టాంగా ఎక్కి కూర్చున్నాను. ఆయున, టాంగా అతనికి క్రితం రాత్రి మమ్మల్ని హోటల్‌కి తీసుకొచ్చినందుకు, మళ్ళీ ఇప్పుడు నన్ను ఇంటి దగ్గర దిగబెట్టటానికి కలిపి డబ్బులిచ్చారు. టాంగా అతనికీ ఈయునకీ కాస్త మాటామాటా పెరిగింది.

"ఇదేమిటి ఐదురూపాయలేనా!" టాంగా అతనడిగాడు.

"ఏం తక్కువైందా"

"పది రూపాయలివ్వండి సార్! పది మీ ఇద్దర్ని రాత్రి తీసుకు వచ్చినందుకు ఐదు. ఇప్పుడు ఆమెని తీసుకెళ్తున్నందుకు ఐదు."

"ఇదిగో తీసుకో, ఇంకో రూపాయి"

'నేనేం భిక్షం అడుక్కోవటం లేదు'

నేనెంతగా చెప్పిచూసినా ఆయన టాంగా అతనికి ఆరు రూపాయలకంటే ఒక్క పైసా కూడా ఎక్కువివ్వలేదు. నిండు పాలగ్లాసులో ఉప్పురాయి పడినట్లయింది నాకు, టాంగా అతను గొణుక్కుంటూ ఆ డబ్బులు జేబులో వేసుకున్నాడు. ఆయున మీద కోపాన్ని పాపం అతను టాంగా లాగుతున్న మూగప్రాణిపై చూపించాడు. అనిరీక్షితమైన ఆ దెబ్బలకి బెదిరి గుఱ్ఱం వేగంగా ముందుకురికి మళ్ళీతన మామూలు వేగానికి వచ్చింది.

టాంగా శబ్దం చేసుకుంటూ ఇంటివేపుకు సాగిపోతోంది. నేను పాలగ్లాసులో పడ్డ ఉప్పురాయి గురించి ఆలోచిస్తూ, వీధిలో జరుగుతున్న గలాటా గమనించకుండా ఉదాసీనంగా కూర్చున్నాను. అంతలో టాంగా అతను ఖాండ్రించి ఉమ్మేసి నావేపు చూసి అన్నాడు 'ఈ డబ్బున్నవాళ్ళంతా ఇంతే'

నేను అతనివైపు తలతిప్పి చూసాను. "పందులకంటే హీనం వీళ్ళు. తింటానికి, తాగటానికి, ఆడాళ్ళనేసుకు తిరగటానికి, మజా చేయటానికి ఇష్టం వచ్చినట్టు డబ్బు వెదజల్లటానికి వెనకాడరు. కానీ కష్టపడే వాళ్ళకి ఒక రూపాయి యివ్వాలంటే ఈ లుచ్చా నాయాళ్ళు వాళ్ళ బాబుగాడి సొమ్మేదో పోయినట్టు బాధపడతారు' చెప్పుకుపోతున్నాడతను.

అతని తిరస్కారపు మాటలు విన లేక తల తిప్పుకున్నాను. కొద్ది క్షణాలు నిశ్శబ్దంగా తోలాడు. తర్వాత, బాగా సానుభూతి నిండిన స్వరంతో నన్ను 'అమ్మా!' అని పిలిచాడు. అతను పిల్చిన తీరు, వాత్సల్యంతో నిండిన స్వరం నన్ను అతని వేపు చూసేట్టుచేసాయి. చివరిశ్వాస విడుస్తున్న పక్షిలా నా కళ్ళలోకి చూస్తూ అతనడిగాడు 'అమ్మా! వాడు నీకైనా పూర్తిగా డబ్బులిచ్చాడా లేదా!'

★

## 'అయోని' కథ మీది విమర్శకు ప్రతిస్పందన

ఎస్సెస్. ఖలందర్

లైంగిక వ్యాపారానికి బలైపోతున్న చిన్నారి పాపల రక్తకన్నీళ్లకు 'అయోని' కథ ప్రత్యక్ష సాక్ష్యం. సమాజం మీద ఇదొక కామెంట్!

కథగానీ, మరే ఇతర ప్రక్రియగానీ, వాటి కోసం ఏర్పడ్డవే లక్షణాలు, ఇతరత్ర విషయాలు. అంతేతప్ప, లక్షణాలను బట్టి కథ తయారుకావాలనడం సరైన పద్ధతికాదు. రచయిత సర్వస్వతంత్రుడూ, సార్వభౌముడు. 'రచన' కు హద్దులూ, పరిమితులు వుచడం అర్థంలేనిది విమర్శకులు 'అయోని' కథలో శిల్పంలేదనడం ఆశ్చర్యంగా వుంది. అసలు శిల్పం అంటే ఏమిటీ? దీన్ని నిర్వచించబోయిన చాలామంది లాక్షణీకులు బోర్లాపడ్డారు. శరీరంలోని ఇతర అంగాల్లాగే, 'యోని' కూడా ఒక అంగం. కథ పేరు 'అయోని'. ఈ కథలో లక్షణమే శిల్పం. కథ పాత్ర చేతే చెప్పబడుతుంది. శిల్పమంటే కథానికలోని లక్ష్యాన్ని పటిష్టంగా చెప్పడానికి చెప్పబడేదే తప్ప, మరొకటికాదు.

అయోని కథలో అంగాంగ వర్ణనలున్నాయన్న అభియోగం కూడ తప్పే! "యోని, అయోని, అయోనిజ" అన్న పదాలు బూతు పదాలు కావు. "మగపిల్లలకు బట్టల్లేకుండా చూసినపుడు నాకు మగపిల్లలమీద జాలేసేది" అన్న వాక్య ప్రయోగాలు, "ఇక్కడికొచ్చాక నాకు మగాళ్లమీద జాలిపోయింది. వాళ్ల ఆ తోకను విషంపూసినకత్తిగా, ఖడ్గమృగపు కొమ్ముగా మార్చగలరని తెలిశాక, మగవాళ్లంటే భయంతో చచ్చిపోతున్నాను" అన్న వాక్యానికి, మిగతా కథకు అవసరమైన వస్తువులు. "నేను చిన్నపిల్లను కాదు. మనిషిని కాదు. ప్రాణినికూడా కాదేమో, ఒక యోనిని అంతే! అదొక్కటే ఒక చిన్న కంతను. అన్నంపెట్టే అయోనేనేనా?" అన్న వాక్యాల్ని చదివినప్పుడు పాఠకుడు, పాత్రపడే బాధని అనుభూతి చెందుతాడు అంతేగానీ, ఇటువంటి వాక్యాలు చీదరించుకునేలా లేవు.

### ఇప్పుడీ గోడవంతా ఎందుకూ?

వ్యాపార వుక్కు కౌగిళ్లలో చిక్కిన కథ తన రూపురేఖల్నే కోల్పోయింది. నవల, కథకు కాలక్షేపమే పరమాశయమైపోయింది. అందువల్లే వీటిని వదిలి, అంతకన్నా మంచి ఎంటర్‌టైన్‌మెంట్‌నిచ్చే టీ.వీ. స్టార్లకు వలస పోతున్నారు పాఠకులు. ఈ దుష్పరిణామం నుంచి కాపాడ్డానికే ప్రస్తుతం కొన్ని పత్రికలు బయులుదేరాయి. అందువల్లనే "అయోని" వంటి కథ వెలుగుచూడగలిగింది. ఈ కథ చదివిన పాఠకుని హృదయం ప్రతిస్పందించకపోతే, ఈ కథ విఫలమైనట్లే. కానీ అలా జరగలేదు. కథ చర్చనీయాంశమయ్యింది. 'అయోని' వంటి కథలు ఆహ్వానించదగ్గవి. కథ చదివిన పాఠకుడికి సమస్యాపరిష్కారం తోచని అయోమయం మిగులుతుంది. అందువల్లే ఈ కథ వుత్తమకథల కోవకు చెందింది. చలం ప్రత్యేక సంచికలో ఈ కథ రావడం ఓ విశేషం.

●